# నవతరం

RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 122 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

12-03-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# టౌన్ ప్లానింగ్‌లో ఏసీబీ దర్యాప్తు జోరు





- రెండో రోజుకూ కొనసాగిన తనిఖీలు
- అక్రమ ప్లాన్లు, కట్టడాలపై ఫోకస్
- రిజర్వ్ సైట్ల ఆక్రమణలపై కూడా ఆరా
- ఫోన్‌పే లావాదేవీలపై పరిశీలన
- అధికారుల్లో వణుకు.. ఎవరికి ఎప్పుడు పిలుపో?

**(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)**

శ్రీకాకుళం నగరంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన దర్యాప్తు రెండో రోజుకూ కొనసాగింది. నిన్న ప్రారంభమైన తనిఖీలు ఈరోజు మరింత వేగం పుంజుకున్నాయి. రెండు బృందాలుగా విడిపోయిన అధికారులు నగరంలోని పీఎన్ కాలనీ, పాలకొండ రోడ్డు, ఓబీఎస్ తరంగపట్నం రోడ్డు, రామలక్ష్మణ జంక్షన్ ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు, అనుమానాస్పద ప్లానింగ్ అనుమతులపై విచారణ చేపట్టారు.

అధికారిక అనుమతులు లేకుండానే దొంగ ప్లానింగ్‌లు ఇచ్చి అక్రమ నిర్మాణాలు నిర్మించేందుకు సహకరించినట్టు ఆరోపణలు రావడంతో ఈ దర్యాప్తు ప్రారంభమైనట్టు తెలిసింది. ముఖ్యంగా ప్రజలకు చెందిన సైట్లు, నిర్మాణాల అనుమతుల్లో జరిగిన అక్రమాలపై అధికారులు సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నారు.

ఇక నగరంలో ప్రభుత్వానికి చెందిన రిజర్వ్ సైట్లు పెద్దఎత్తున ఆక్రమించబడినట్లు వచ్చిన ఫిర్యాదులపై కూడా ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాంటి రిజర్వ్ భూములపై కూడా ప్లానింగ్ అనుమతులు ఇచ్చిన ఘటనలపై విచారణ జరుగుతున్నట్టు సమాచారం.

టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసిన సిబ్బంది, సంబంధిత అధికారులు ఇచ్చిన అనుమతుల ఫైళ్లను పరిశీలిస్తూ వివరాలు తీసుకుంటున్నట్టు సమాచారం. కొందరు సెక్రటరీలు, ఏసీపీలు, టౌన్ ప్లానింగ్ అధికారుల పాత్రపై కూడా ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నట్టు తెలుస్తోంది.

ఇక అనుమతుల కోసం తీసుకున్న లావాదేవీలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. ముఖ్యంగా ఫోన్‌పే వంటి డిజిటల్ చెల్లింపుల ద్వారా జరిగిన లావాదేవీల వివరాలను కూడా అధికారులు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ క్రమంలో సంబంధిత వ్యక్తులను కూడా విచారించినట్టు తెలిసింది.

ఈ తనిఖీలు ఇంకెన్ని రోజులు కొనసాగుతాయో స్పష్టత లేకపోయినా టౌన్ ప్లానింగ్ కార్యాలయంలో మాత్రం ఒక్కసారిగా వణుకు పుట్టింది. ఎవరిని ఎప్పుడు పిలిచి విచారిస్తారోనన్న ఆందోళనతో పలువురు అధికారులు ఉత్కంఠగా ఉన్నట్టు సమాచారం. ఈ దర్యాప్తు కేవలం ఎంక్వయిరీ వరకే పరిమితమవుతుందా.. లేక క్షేత్రస్థాయిలో అధికారులపై చర్యలకు దారి తీస్తుందా అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన అవసరం లేదు

- రొయ్యల రైతులు పానిక్ హార్వెస్టింగ్ చేయొద్దు
- వదంతులను నమ్మకుండా శాస్త్రీయంగా అక్వాకల్చర్ కొనసాగించాలి
- షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**నవతరం -అమరావతి**



గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రొయ్యల రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బుధవారం విజయవాడ క్యాంప్ కార్యాలయం నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అక్వాకల్చర్ డెవలప్మెంట్ ఆథారిటీ కో-వైస్ ఛైర్మన్, నాన్-ఆఫీషియల్ -మిగతా 3లో

# శివసాగర్ బీచ్‌లో చెత్త సేకరణ

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష
- నాయకత్వం అంటే ఆచరించి చూపడమేనని సందేశం



**(నవతరం - పలాస)**

శ్రీకాకుళం: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఎమ్మెల్యే గౌతు శిరీష స్వయంగా చెత్తను సేకరించి పరిశుభ్రతపై ప్రజలకు, యువతకు ఆదర్శంగా నిలిచారు. సముద్ర తీరాలను, పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ఆమె అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్వచ్ఛమైన సమాజం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, వజ్రపుకొత్తూరు మండల అధికారి రమేష్ నాయుడు, వజ్జ బాబురావు, పిరికట్ల విఠల్‌రావు, మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, గోరకల వసంతస్వామి, ఉమామహేశ్వరరావు,



శశిభూషణ్, సింగుపల్లి బాలకృష్ణ, మల్లా శ్రీనివాసరావు, మారడ దుర్యోధనతో పాటు కూటమి నాయకులు, మున్సిపాలిటీ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తూ ముగ్గురు యువకులు పట్టుబాటు



- ఎచ్చెర్ల పరిధిలో పోలీసుల దాడి
- 2.3 కేజీల గంజాయి స్వాధీనం
- మరో యువకుడు పరారీ.. కేసు నమోదు

3లో



ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామారావు

# శిరస్త్రాణం ధరించండి

**నవతరం -శ్రీకాకుళం**

హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వి. రామారావు అన్నారు. బుధవారం శ్రీకాకుళం పట్టణంలో నిర్వహించిన హెల్మెట్ స్పెషల్ డ్రైవ్‌లో ఆయన వాహనదారులకు అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ శ్రీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బంది హెల్మెట్ అవశ్యకత,రహదారి భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి హెల్మెట్ అవసరాన్ని వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో ముఖ్యంగా యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌ను నివారించాలని కోరారు.

ఎడిటోరియల్

# ధరాఘాతుకం

మధ్యప్రాచ్యం యుద్ధ ప్రభావం మన వంటింటిపై పడింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు, గ్యాస్ ధరలు పెరిగాయన్న బూచితో కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగ (ఎల్పీజీ), కమర్షియల్ గ్యాస్ ధరలను పెంచి ధరాఘాతుకానికి పాల్పడుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ కలిసి అధర్మ యుద్ధం కొనసాగిస్తున్న ఫలితమే ఈ చమురు కొరత ఎదుర్కోక తప్పని పరిస్థితికి దారితీసింది. వంట గ్యాస్ ధర సిలిండర్‌పై రూ.60 పెరిగింది. అదే వాణిజ్య అవసరాలకు వాడే సిలిండర్ల ధర రూ.116 పెరిగింది. చమురు నిలవలు తగ్గితే, ఇరాన్ నుంచి చమురు దిగుమతికి ఆటంకాలు కొనసాగితే పెట్రోల్, డీజిల్ ధరలు అగ్గిపుల్ల లేకుండానే మండిపోతాయి. అమెరికాకు తలొగ్గి రష్యా నుంచి దిగుమతులు నిలిపివేసిన పర్యవసాన ఫలితమిది.

అచ్చేదిన్ గురించి అస్తమానం కబుర్లు చెప్పే మోడీ ప్రభుత్వం సామాన్య జనం నెత్తిన మళ్లీ గ్యాస్‌బండ భారం మోపింది. ఎల్‌పిజిపై ప్రజలకు బోలెడంత రాయితీ ధారబోస్తున్నామంటూ బొంకి, నెమ్మది నెమ్మదిగా సబ్సిడీ మొత్తానికి సర్వమంగళం పాడిన మోసకారితనం మోడీ అండ్ కోది. దాదాపు పదేండ్ల క్రితం నగదు బదిలీపై గొప్పగా ఢంకా బజాయించి, సబ్సిడీ సొమ్మును నేరుగా వినియోగదారుల ఖాతాల్లోనే జమ చేస్తామంటూ బీరాలు పలికింది. ఆ తరువాత సిలిండరు ధరను అంతకంతకూ పెంచుకుంటూ పోయింది. ప్రారంభంలో రూ.200 పైగా ఖాతాల్లో జమైన రాయితీ సొమ్ము ఇప్పుడు రూ.15కు కరిగిపోయింది. అంటే దేశంలో కోట్లా మంది ఎల్‌పిజి వినియోగదారులను చెప్పాపెట్టకుండా రాయితీని తెగ్గోసి, మోసగించింది బీజేపీ సర్కార్.

పాతికేండ్ల కిందటి వరకూ ఏడాదికొకసారి పెట్రో ఉత్పత్తుల ధరలను సవరించటం, పూలింగ్ పద్ధతిలో ధరల సర్దుబాటు చేయటం విధానంగా ఉండేది. దాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, అంతర్జాతీయ ఇంధన మార్కెట్టులోని హెచ్చుతగ్గులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు ధరల్లో మార్పులు ఉంటాయని కేంద్ర పాలకులు గతంలోనే ప్రకటించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానాలను మరింత స్పీడుగా అమలుచేస్తోంది. అందులో భాగమే పెట్రోల్, డీజిల్, గ్యాస్ వంటి పెట్రోలియం ఉత్పత్తులతో సహా నిత్యావసర సరుకుల ధరలు అడ్డూ అదుపూ లేకుండా పెరగడం. ధరలు పెరిగినప్పుడు పెంచ టం, తగ్గినప్పుడు తగ్గించటం సహజంగానే జరిగిపోతుందని సన్నాయి నొక్కులు నొక్కడం. నిజానికి ఆచరణలో జరుగు తున్నదేమిటి? భారం పెరిగితే జనం మీదికి నెట్టటం, ధర తగ్గితే చమురు కంపెనీల ఖాతాల్లోకి మళ్లించటం. "రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకున్నారో" ఖబడ్దార్ అని ట్రంప్ హుంకరించిన తరవాత మన దిగుమతులు ఎలా తగ్గాయో చూస్తే ట్రంప్ మాటలను జవదాటని "మంచి బాలుడు మోడీ" అన్న సత్యం బోధపడ్తుంది. రష్యా- ఉక్రెయిన్ యుద్ధం మొదలైనప్పుడు రష్యా మీద అమెరికా ఆంక్షలు విధించింది. అయినా మనం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోవడం ఆపలేదు. కానీ "చమురు దిగుమతి చేసుకోకూడదు" అని అమెరికా ఆదేశించిందే తడవుగా ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం సంస్థలు దిగుమతులు ఆపేసి తమ స్వామి భక్తిని చాటుకున్నాయి. పశ్చిమాసియా వివాదం ఈ గ్యాస్ ధరల పెంపునకు కారణమమని మోడీ ప్రభుత్వం సమర్థించుకోవడం దాని స్వయంకృత అపరాధాన్ని కప్పిపుచ్చుకోవడానికి చేసే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. నిజానికి ఇది ట్రంప్ యుద్ధోన్మాద విధానాల ముందు మోడీ ప్రభుత్వం లొంగిపోవడం. దేశ ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తూ అమెరికా ప్రపంచ ఆధిపత్య ప్రయోజనాలకు సేవ చేయడానికి సిద్ధపడ్డ కేంద్రం తీరును ఇది ప్రతిబింబిస్తోంది.

తగిన ఆదాయాలు లేక ప్రజల్లో కొనుగోలు శక్తి రోజురోజుకీ తగ్గిపోతున్న వాస్తవం అనేక రూపాల్లో కళ్ల ముందు కనిపిస్తోంది. వీరి పాలనలో నిత్యావసరాల ధరలు భారీగా పెరగడమే తప్ప, కిందికి చూడడం లేదు. ధరలను అదుపులోకి తేవాల్సిన పాలకులు ఆ పని చేయకపోగా, అవి మరింత పెరగటానికి కారణమయ్యే ఎల్‌పిజి, పెట్రో ధరలను పెంచటం బాధ్యతారాహిత్యం. నెలకు సంపాదించే మొత్తంలో దాదాపు ఇరవై శాతం ఒక్క సిలిండరుకే ఖర్చయిపోతుంటే ఆ కుటుంబాలు ఇక ఏం వండుకోవాలి? ఏం తినాలి? పేదల జీవితాల్లో వెలుగులు నింపటానికి అంటూ తీసుకొచ్చిన ఉజ్వల పథకం వినియోగదారులపైనా భారాలకు తెగబడింది ప్రభుత్వం. ఇది గ్యాస్ వినియోగాన్ని పక్కన పెట్టి, మళ్లీ కట్టెల మోపు వైపు నెట్టటానికే ఉపయోగపడుతుంది. అయినా వామపక్ష పార్టీలు తప్ప మరో పార్టీ ఉద్యమించడం లేదు. అన్ని తరగతులపైనా, నిత్యావసర ధరల పైనా ప్రభావం చూపే ఈ పెంపును తక్షణం ఉపసంహరించుకోవాలని ఇప్పటికైనా బీజేపీయేతర పార్టీలు, రాష్ట్ర ప్రభుత్వాలు సైతం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ధరాఘాతుకాన్ని అడ్డుకోవాలి. కేంద్రం పెంచిన ఎల్‌పిజి ధరను తక్షణమే ఉపసంహరించటంతో పాటు రాయితీని భారీగా పెంచాలి.

# వైద్యాధికారి రవికుమార్‌పై దాడి ఖండన

## పోలాకి పీహెచ్‌సీ ఎక్స్టెన్షన్ ఆఫీసర్‌పై దాడి అమానుషమని ఏపీఎన్జీఓ సంఘం ఆగ్రహం



నవతరం శ్రీకాకుళం

పోలాకి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎక్స్టెన్షన్ ఆఫీసర్ నల్లి రవికుమార్‌పై కొందరు దుండగులు దాడి చేయడం తీవ్రంగా ఖండనీయమని ఏపీ ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ ఛైర్మన్ హనుమంతు సాయిరాం తెలిపారు.

వివాదం ఏదైనా చట్టపరంగా పరిష్కరించుకోవాలే తప్ప ఉద్యోగులపై రౌడీ దాడులు చేయడం అమానుషమని అన్నారు. ఘటనపై ఇప్పటికే కేసు నమోదైన నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ ఘటనపై జిల్లా వైద్యాధికారితో పాటు కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లామని తెలిపారు. బాధితుడు రవికుమార్ భార్య కూడా ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు.

ఏపీఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయి వేణుగోపాల్ మాట్లాడుతూ ఉద్యోగులపై భౌతిక దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, కోశాధికారి బడగల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# మా పంట పొలాలు జోలికి రావద్దు

## తలగాం, పరిసర ప్రాంతాల రైతులు ఆందోళన



నవతరం -టెక్కలి

పంట పొలాలు తీసుకుని పోర్టు ఆధారిత సంస్థలు నెలకొల్పాలనే ప్రభుత్వా నిర్ణయానికి వ్యతిరేక నిరసన. - టెక్కలి బన్నువాడ అయోధ్య పురం తలగాం పరిసర ప్రాంతాల రైతులు రాజకీయాలకు అతీతంగా ఆందోళనలు. బిప్రాణ త్యాగాలు కైనా సిద్ధమేనని రైతులు ప్రతిజ్ఞ. నవతరం టెక్కలి.

నేడు స్థానిక టెక్కలి మండలం తలగాం గ్రామంలో పోర్టు ఆధారిక సంస్థలను నెలకొల్పాలని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్రదర్శనలు చేస్తూ భారీ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భముగా కొంతమంది రైతులు మాట్లాడుతూ మాకు బ్రతుకు నిచ్చే పచ్చని పంట పొలాలను తీసుకుని పోర్టు ఆధారిత సంస్థలు ను నెలకొల్పాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూన్నా మని మా పంటపొలాలు జోలికి రావద్దు అంటూ తలగాం, మరియు చుట్టు పక్కల గ్రామాల రైతులు, కూలీలు రాజకీయాలకు అతీతంగా మేము పోరాటాన్ని సాగిస్తామని తెలిపారు. ఆందోళనలు, పోరాటాలు ద్వారా బలవంతుపు భూసేకరణ ను అడ్డు కుంటామని, ప్రాణత్యాగాలు కైనా సిద్ధపడతామని ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ పంచాయతీల పెద్దలు, రైతులు, కూలీలు, రిటైర్ ఉద్యోగులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 4-5న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు

- శ్రీకాకుళంలో జరగనున్న 18వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు
- జిల్లా కార్యాలయంలో కరపత్రం విడుదల చేసిన నాయకులు

నవతరం శ్రీకాకుళం




ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం శ్రీకాకుళం జిల్లా కమిటీ 18వ మహాసభలను ఏప్రిల్ 4, 5 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్, జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం పిలుపునిచ్చారు.

జిల్లా కార్యాలయంలో జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. సమావేశానికి సిర్ల ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగరాపు సింహాచలం మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, రైతుల శ్రమ వల్లే దేశ ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగుతోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తోందని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 200 మంది ప్రతినిధులు మహాసభలకు హాజరవుతారని తెలిపారు. నిర్వాసితులు, గిరిజనులు, రైతాంగ సమస్యలు, భూమి-కూలి, ఉపాధి హామీ వంటి అంశాలపై చర్చలు జరగనున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కె. ఎల్లయ్య, జి. ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# వంట గ్యాస్ ధరల పెంపు దుర్మార్గం...

- మోదీ పాలనలో గ్యాస్, పెట్రోలియం ద్వారా లక్షల కోట్ల అక్రమ వసూళ్లు..
- 500 రూపాయలకే వంటగ్యాస్ ఇవ్వాలి...
- నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్




నవతరం శ్రీకాకుళం

వంటగ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని, పెరిగిన వంట గ్యాస్ ధరల వలన సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా నష్ట పోతున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొన్న శ్రీనివాస్, బొత్స సంతోష్ అన్నారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు నరసన్నపేట మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కొన్న శ్రీనివాస్ మాట్లాడుతూ దేశంలో మహిళలంటే అత్యంత గౌరవం అని గొప్పలు చెప్పే నరేంద్ర మోదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున గ్యాస్ ధరలు పెంచడం అన్యాయమని అన్నారు. ఇంటి వాడక సిలిండర్ పై 60 రూపాయలు, దుకాణాలు వాడే సిలిండర్ పై 115 రూపాయలు చొప్పున పెంచడం సరికాదని అన్నారు. ఇంకోవైపు నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుదలవలన సామాన్య ప్రజల జీవన విధానం అస్తవ్యస్తంగా ఉందని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు గ్యాస్, పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా లక్షల కోట్లు అక్రమంగా వసూలు చేశారని విమర్శించారు. సామాన్య మధ్యతరగతి ప్రజలను గుర్తుపెట్టుకుని వంటగ్యాస్ రూ. 500 కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నరసన్నపేట మండల కార్యదర్శి ఆర్ అరవింద్, సిపిఐ నాయకులు నెయ్యల నారాయణరావు, లవ కుమార్, భాస్కరరావు, లక్ష్మి, శ్యామ్, వసంతరావు, అచ్చేమ్మ తదితరులు పాల్గొన్నారు

# ఒకేసారి మూడు కొలువులలతో సత్తా చాటిన రామదాసుపురం యువకుడు

నవతరం -పొందూరు :



పొందూరు మండలం రామదాసుపురం గ్రామానికి చెందిన బొడ్డేపల్లి గుణశేఖర్ ఒకే సారి మూడు బ్యాంకు కొలువులు సాధించి సత్తాచాటాడు. గతేడాది నిర్వహించిన బ్యాంకు పోటీ పరీక్షలకు హాజరయ్యాడు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్బిఐ క్లర్క్, కెనరా బ్యాంక్ పిఓ , క్లర్క్ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు బొడ్డేపల్లి విశ్వనాథం, కళ్యాణి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు గుణశేఖర్ ను అభినందించారు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన గుణశేఖర్ ఒకేసారి మూడు బ్యాంకు ఉద్యోగాలను సాధించి పలువురికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

# ఆకుకూరల పాట ఆరోగ్య గీతం



ఆకుకూర తింటే ఆరోగ్యం రా
అమ్మ వంటలో అసలైన వరం రా
పచ్చగా ఉన్నా పోషకమే రా
ప్రతిరోజు తింటే బలం పెరుగురా

పాలకూరలో ఇనుము బలం రా
తోటకూరలో శక్తి నిల్వ రా
గోంగూర పుల్లగా రుచిగా రా
మన భోజనంలో మజాగా రా

మెంతికూర వాసన మనసు దోచురా
కొత్తిమీర రుచిని మరింత పెంచురా
కరివేపాకు పోపు పరిమళం రా
పుదీనా చట్నీ చల్లని సుఖం రా

చుక్కకూర పులుపు ఆరోగ్యం రా
మునగాకు విటమిన్ గని రా
బచ్చలికూర పప్పులో మజా రా
పొన్నగంటికూర కంటి వెలుగు రా

ముల్లంగి ఆకులు బలం ఇస్తురా
లెట్యూస్ సలాడ్‌లో చల్లని రా
తెల్ల గలిజేరు ఔషధం రా
ప్రకృతి ఇచ్చిన వరం ఇదిరా

ఆకుకూర తింటే ఆరోగ్యం రా
మన జీవితం ఆనందం రా
ప్రతి రోజు తింటే బలం రా

మన భారత ఆహారం గొప్పదిరా

రచన-తేరాల రాజేంద్ర ప్రసాద్
రత్న లహరి ఛానల్ సీఈవో
9297109223 సికింద్రాబాద్

# శర్వాణి కృషికి సరైన గుర్తింపు "ఉత్తమ పాఠశాల అవార్డు"



విశ్రాంత డి.ఇ.ఓ బలివాడ.మల్లేశ్వరరావు

**నవతరం-శ్రీకాకుళం**

ఎడ్యు కనెక్ట్ ఇన్ అనే జాతీయస్థాయి స్కూల్ సెర్చ్ ప్లాట్ఫామ్ డిసెంబర్ 2025, జనవరి 2026 మధ్య దేశ వ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది తల్లిదండ్రులకు సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో శ్రీకాకుళం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో అకడమిక్ ఎక్సెలెన్స్, పిల్లల సర్వతోముఖాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న అరసవిల్లి రోడ్లో గల శర్వాణి విద్యాలయను బెస్ట్ స్కూల్ అవార్డుకు ఎంపిక చేసారు. ఈ సందర్భంగా ఎడ్యు కనెక్ట్ ఇన్ సంస్థ నుండి బెస్ట్ స్కూల్ సర్టిఫికేట్ను వర్చువల్గా అందజేసారు. ఇందులో భాగంగా విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి బలివాడ మల్లేశ్వరరావుగారు బెస్ట్ స్కూల్ సర్టిఫికేటును సభాముఖంగా ఆవిష్కరించి శర్వాణి విద్యాసంస్థల వ్యవస్థాపకులు అంధవరపు సూరిబాబు, కరస్పాండెంట్ ఎ. ఆంజనేయులు, హెడ్మిస్ట్రెస్. డా॥ కె. రేఖ లకు అందజేసారు. ఈ సందర్భంగా బలివాడ మల్లేశ్వరరావుగారు మాట్లాడుతూ సంస్థ స్థాపించిన నాటినుండి విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి వివిధ వినూత్న కార్యక్రమాలను అవలంబిస్తూ విద్యార్థులలో సృజన, శోధన, సాధనలకు పదునుబెట్టి సత్ఫలితాలను సాధించడంలో శర్వాణి సఫలీకృతమైందని, అందుకుగాను ఇటువంటి ఉన్నత గుర్తింపును సాధించడం చాలా సంతోషదాయకమని, అత్యున్నత పురస్కారాలు లభించడం సంస్థ సేవాతత్పరతకు మరింత ప్రోద్బలాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. లాభాపేక్ష లేకుండా పేద, మధ్యతరగతి వర్గాలకు అత్యంత చేరువగా విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రజల మన్నలను సూరిబాబు ఆధ్వర్యంలో శర్వాణి సంస్థ పొందగలగడం సిక్కోలు విద్యా చరిత్రకే ఒక మంచి గుర్తింపుగా అభివర్ణించారు. శర్వాణి విద్యాసంస్థల అధినేత అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ సంస్థను స్థాపించినప్పుడు ఉన్న సదాశయాలను నెరవేర్చేందుకు తనతోపాటు కరస్పాండెంట్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ డా॥ రేఖ, అత్యంత అనుభవశీలురైన తమ ఉపాధ్యాయ బృందం చేసిన అవిరళకృషి ఫలితంగా ఎడ్యు కనెక్ట్ ఇన్ జాతీయ సంస్థవారు చేసిన సర్వేలో తమ సంస్థ పేరును ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది తమకు నూతన ఉత్తేజాన్నిచ్చిందని, మరిన్ని ప్రామాణిక విద్యా, విద్యేతర కార్యక్రమాలను రూపొందించి విద్యారంగానికి సేవ చేసే బాధ్యతను పెంచిందని ఎడ్యు కనెక్ట్ సంస్థకు కృతజ్ఞతలు తెలియజేసారు. అనంతరం కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు మాట్లాడుతూ సూరిబాబు ఆశయాలకు అనుగుణంగా ప్రతిరోజు తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చేవిధంగా ప్రణాళికా బద్ధంగా నిబద్ధతో చేపట్టిన కార్యక్రమాలు తమకు నిరంతరం శ్రీరామరక్షగా నిలిచి తల్లిదండ్రులలో సడలని నమ్మకాన్ని పెంపొందించాయన్నారు. ఇకపై కూడా మరిన్ని కొత్త విద్యాకార్యక్రమాలతో తల్లిదండ్రులకు చేరువౌతామన్నారు. హెడ్మిస్ట్రెస్ డా॥ కె. రేఖ మాట్లాడుతూ కేవలం బాగా చదివే విద్యార్థులనే కాకుండా అభ్యసనా లోపాలుగల విద్యార్థులలో కూడా నేర్చుకోవాలనే కుతూహలాన్ని ప్రేరేపించేదిగా ప్రయోగాత్మక - పరిశీలక అభ్యసనా విధానాన్ని అవలంబిస్తూ విద్యార్థులలో నైతిక స్థైర్యాన్ని తమ సంస్థ ప్రత్యేక పాఠ్యప్రణాళికగా అవలంబిస్తుందని ఇలాంటి జాతీయస్థాయి సంస్థలిచ్చే అవార్డులు తమ నిబద్దతకు గుర్తింపుగా తాము భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బలివాడ.మల్లేశ్వరరావు, సంస్థ యాజమాన్యాన్ని, ఉపాధాయులను, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గాయాల వేదాంతం..?



కనిపించని గాయాలు
కాలం బోధించే కఠిన
పాఠాలు..!

ముళ్ళ బాటలో
పాదానికి...తగిలిన
గాయం...
ఎడారిలో ఒంటెలా
ఆచితూచి
అడుగులేయమంటుంది...

కంటికి...తగిలిన గాయం...
నిప్పును నీరుగా భ్రమపడే
చకోర పక్షిలా
మోసపోవద్దంటుంది...

శిల్పాన్ని
మలిచే ఉలిదెబ్బలా
చేతికి...తగిలిన గాయం...
చరిత్ర పుటల్లో చెరిగిపోని
సంతకంగా మనల్ని
తీర్చిదిద్దుతుంది...

పెదవులకు...
తగిలిన గాయం...
మౌనపు మధురిమను
వెదజల్లే వేణువులా
మృదుభాషణను
నేర్పిస్తుంది...

కానీ...మమతల కోవెల
వంటి
గుప్పెడు గుండెకు తగిలిన
గాయం...
చేస్తుంది బ్రతుకును కన్నీటి
మయం...

ఔను చీకట్లను
చీల్చే
జ్ఞానసూర్యునిలా
అరిషడ్వర్గాల
అంతాన్ని కోరుతూ
ప్రేమ జాలి దయ
కరుణనే కవచంతో
ప్రశాంత జీవన
వేదాంతాన్ని
మనకు
బోధించే
పరమగురువులే
ఈ గాయాలు..!
ఓ నా
ప్రియభక్తులారా
గుర్తుంచుకోండి..!
ఈ
"గాయాలవేదాంతం"మీ
జీవితాంతం..!



కవి రత్నసాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్

# గల్ఫ్ ఉద్రిక్తతలపై ఆందోళన అవసరం లేదు

మొదటి పేజీ తరువాయి

కమిటీ సభ్యులు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రస్తుత పరిస్థితులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియా లో వచ్చిన వార్తలు, మధ్యప్రాచ్య ప్రాంతంలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు మన దేశ సముద్ర ఆహార ఎగుమతులపై చూపే ప్రభావం గురించి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ మధ్యప్రాచ్య (గల్ఫ్) ప్రాంతంలో జరుగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా మీడియాలో వచ్చిన వార్తల వల్ల కొంతమంది ఆక్వా రైతుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలిపారు. సముద్ర ఆహార ఎగుమతులపై ప్రభావం ఉంటుందనే భయంతో ముందస్తు లేదా పానిక్ హార్వెస్టింగ్ చేయడం సరికాదని రైతులకు సూచించారు. భారతదేశం నుండి జరిగే మొత్తం సముద్ర ఆహార ఎగుమతుల్లో మధ్యప్రాచ్య దేశాలకు వెళ్లేది కేవలం 3,4 శాతం మాత్రమేనని, అది కూడా ప్రధానంగా హోర్ముజ్ జలసంధి (హ్తీఖ్ఘ్ శీట ఎశీతీఎబఓ) ద్వారా జరుగుతుందని తెలిపారు. ఇతర దేశాలకు యూరోపియన్ యూనియన్ (జుఖ), అమెరికా (ఖూూ), జపాన్, చైనా వంటి దేశాలకు వెళ్లే సముద్ర ఆహార కంటైనర్లు రెడ్ సీ సూయెజ్ కాలువ మార్గం, కేప్ ఆఫ్ గుడ్ హోప్ మార్గం, చైనా సముద్ర మార్గం ద్వారా నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని చెప్పారు. అందువల్ల ప్రస్తుత పరిస్థితులు భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

## అమెరికా టారిఫ్‌లతో పోటీ సామర్థ్యంపై ప్రభావం లేదు

అమెరికా మార్కెట్‌లో డిమాండ్ 2026 మార్చి నెలాఖరుకు మెరుగుపడే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా సీ ఫుడ్ ఎక్స్పో నార్త్ అమెరికా (మార్చి 15-17, 2026, బోస్టన్, అమెరికా) అనంతరం డిమాండ్ పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అమెరికా మార్కెట్‌లో సాధారణంగా 50 మరియు 60 కౌంట్ రొయ్యలకు మంచి డిమాండ్ ఉంటుందని, ఇవి ఆంధ్రప్రదేశ్ రైతులు సాధారణంగా ఉత్పత్తి చేసే సైజులు కావున ఆ కౌంట్ వచ్చే వరకు మధ్యస్థ పట్టుబడులు చేయనవసరం లేదన్నారు. భారతీయ రొయ్యలపై అమెరికా విధించే సుమారు 20 శాతం టారిఫ్ ఇతర పోటీ దేశాలపై ఉన్న టారిఫ్‌లతో సమానంగా ఉండటం వల్ల అంతర్జాతీయ సముద్ర ఆహార ఎగుమతి మార్కెట్‌లో భారతదేశ పోటీ సామర్థ్యం కొనసాగుతుందని మంత్రి తెలిపారు.

## షిప్పింగ్ కంటైనర్ల కొరతపై ప్రచారం అసత్యం

ప్రస్తుతం షిప్పింగ్ కంటైనర్ల కొరత ఉందని ప్రచారం జరుగుతున్న వార్తలు అసత్యమని మంత్రి స్పష్టం చేశారు. కంటైనర్ల కొరత కారణంగా ఎగుమతులు ప్రభావితం అవుతున్న పరిస్థితి ప్రస్తుతం లేదని, అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కంటైనర్లు ఇప్పటి వరకు వెనక్కి రాలేదని తెలిపారు. ఎగుమతుల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు, రైతులకు సమయానుకూల సూచనలు అందించేందుకు ప్రతి నెల చివరి వారంలో APSADA డైరెక్టర్లు, అక్వాకల్చర్ అడ్వైజరీ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భారతదేశం , యూరోపియన్ యూనియన్ మధ్య కొనసాగుతున్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చర్చలు పూర్తైతే భారత సముద్ర ఆహార ఎగుమతులకు మరింత మార్కెట్ అవకాశాలు లభించి భవిష్యత్తులో ఎగుమతులు పెరగడానికి దోహదపడతాయని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆక్వా రైతులు ఆందోళన చెందొద్దు

ఆక్వా రైతులు భయంతో లేదా ముందస్తు హార్వెస్టింగ్ చేయనవసరం లేదని, ఇలా చేయడం వల్ల మార్కెట్‌లో ఒకేసారి అధిక సరఫరా ఏర్పడి రొయ్యల ధరలు పడిపోవడం, రైతులకు ఆర్థిక నష్టం కలగడం జరిగే అవకాశం ఉందన్నారు. రైతులు ఎగుమతిదారులు మరియు మత్స్యశాఖ అధికారుల సలహాలతో తమ ప్రణాళిక ప్రకారం కల్చర్ సైకిల్ పూర్తయ్యాక మాత్రమే సరైన సమయంలో హార్వెస్టింగ్ చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ అంతర్జాతీయ పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్లు , ఇతర సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేస్తూ రాష్ట్రం నుండి సముద్ర ఆహార ఎగుమతులు నిరాటంకంగా కొనసాగేందుకు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలోని రొయ్యల రైతులు నిరాధారమైన వార్తలు , వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా, శాస్త్రీయ విధానంలో అక్వాకల్చర్ కార్యకలాపాలను కొనసాగించాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కోరారు

# గంజాయి సేవిస్తూ ముగ్గురు యువకులు పట్టుబాటు

**నవతరం -శ్రీకాకుళం**

ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి సేవిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు పట్టుకుని 2.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం ఎచ్చెర్ల ఎస్ఐ లక్ష్మణరావుకు వచ్చిన ఖచ్చితమైన సమాచారంతో సిబ్బంది, మధ్యవర్తులతో కలిసి తెలిపిన ప్రదేశంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో అక్కడ ఉన్న నలుగురు వ్యక్తులు పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా ముగ్గురిని పట్టుకోగా, మరో వ్యక్తి తప్పించుకుని పరారయ్యాడు. పట్టుబడిన వారు గంటల సూర్య తేజ (26), తండ్రి భీమేశ్వరరావు, నివాసం కలెక్టర్ కార్యాలయం రోడ్ సమీపంలోని సంతోషిమాత గుడి దగ్గర, శ్రీకాకుళం; బురిడి లైకోన్ ఏ దేవ్ (22), తండ్రి గోపి, ఎస్టీ కోటియా, నివాసం పిట్టగూడ గ్రామం, డుంబ్రిగూడ మండలం, ఆల్లూరి సీతారామరాజు జిల్లా; కేశవ బాలు (20), తండ్రి పోలయ్య, నివాసం దమ్మల వీధి, శ్రీకాకుళం. వారి వద్ద ఉన్న స్కూటీ డిక్కీని తనిఖీ చేయగా రెండు గోధుమరంగు ప్లాస్టిక్ ప్యాకెట్లు, అలాగే కేశవ బాలు ప్యాంటు జేబులో ఉన్న పాలిథిన్ కవర్‌లో గంజాయి ప్యాకెట్ లభ్యమయ్యాయి. మొత్తం మూడు ప్యాకెట్లలో 2.3 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పట్టుబడిన వారు తరచూ ఆ ప్రదేశానికి వచ్చి గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. అరకు ప్రాంతానికి చెందిన బురిడి లైకోన్ ఏ దేవ్ కిలోకు రూ.3,000కు గంజాయి విక్రయిస్తున్నట్లు వెల్లడించారు. గంటల సూర్య తేజ అభ్యర్థన మేరకు ఈరోజు అతను గంజాయి తీసుకువచ్చినట్లు తెలిసింది. పొన్నాడ ఫ్యాక్టరీ రోడ్ వద్ద నలుగురు కలిసి గంజాయి సేవిస్తున్న సమయంలో పోలీసులు దాడి చేయగా ముగ్గురు పట్టుబడగా, సోపెటీ కార్తీక్ అనే వ్యక్తి పరారైనట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, పరారైన వ్యక్తిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టినట్లు జె.ఆర్.పురం సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. అవతారం తెలిపారు.

# గ్రామాల్లో రోడ్లు, కాలువల నిర్మాణానికి ప్రాధాన్యత

**నవతరం -బూర్జ**

ఆమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ మండలం చీడివలస గ్రామంలో రూ.కోటీ 2 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, కాలువల ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆమదాలవలస శాసనసభ్యుడు, రాష్ట్ర పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ హాజరై అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, కాలువలు వంటి మౌలిక వసతులు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు మరింత అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. చీడివలస గ్రామంలో గత ప్రభుత్వ కాలంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని కూటమి ప్రభుత్వం వచ్చిన తక్కువ కాలంలోనే సీసీ రోడ్లు, కాలువలు నిర్మించడంతో గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగానుంటుందని ఆయన తెలిపారు. అలాగే భవిష్యత్తులో కూడా నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకువచ్చి మౌలిక వసతులను బలోపేతం చేస్తామని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పేడాడ రామ్మోహన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ, నగరాల డైరెక్టర్ పిల్లా కన్నంనాయుడు ,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పి.జి ఉపాధ్యాయినికి పిహెచ్.డి ప్రదానం




**నవతరం-శ్రీకాకుళం**




మందస మండలం హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ టు లో ఇంటర్మీడియట్ తెలుగు సబ్జెక్ట్ బోధిస్తున్న పి.జి ఉపాధ్యాయిని బలరాం మహంతి శశికళకు "ఉత్తరాంధ్ర కథా సాహిత్యం" పై రాసిన సిద్ధాంత గ్రంథానికి(థీసిస్) పిహెచ్.డి పట్టా లభించింది. ఈమె పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పిహె.డి ని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ సయ్యద్ అబ్దుల్ నజీర్ పర్యవేక్షణలో సుప్రసిద్ధ మహిళా సైంటిస్ట్ డాక్టర్ శశికళా సిన్హా చేతులమీదుగా పిహెచ్.డి డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి గైడ్ గా వ్యవహరించారు. తన జీవిత భాగస్వామి బలివాడ వేంకటరమణ ప్రోత్సాహం మేరకు ఈ స్థాయికి తాను రాగలిగానని డాక్టర్ శశికళ కృతజ్ఞతా పూర్వకంగా తెలిపారు. ఈమె ఉత్తరాంధ్ర రచయిత గంటేడ గౌరునాయుడు కథా సాహిత్యంపై మదురై కామరాజ్ యూనివర్సిటీ నుంచి ఎం.ఫిల్ పొందారు. వాల్మీకి, ఉషశ్రీల సుందరకాండపై తులనాత్మక అధ్యయనం చేసి మరో ఎం.ఫిల్ డిగ్రీని సొంతం చేసుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఇడి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ తెలుగు పట్టాను, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎం.ఏ ఆంగ్లం పట్టాను పొందారు. కర్నాటక గాత్ర సంగీతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి డిప్లొమాను పొందారు. ఈమె కవయిత్రిగా, మంచి వక్తగా, సుప్రసిద్ధ వైణికురాలిగా, విద్యలరాణిగా ఎనలేని గుర్తింపు తెచ్చుకున్నారు. 1990నుంచిఉపాధ్యాయ వృత్తిలో అరంగ్రేటం చేశారు. విజ్ఞాన్ విద్యా సంస్థల్లోను, ఎ.పి.ఆర్.ఇ.ఎ సొసైటీ పాఠశాలలో పనిచేసిన అనంతరం డి.ఎస్.సిలో మంచి ర్యాంకుతో ఎంపికై జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఉపాధ్యాయినిగా కొనసాగుతున్నారు. తాజాగా పిహెచ్.డి పట్టాను పొందిన ఈమెను పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొడ్డేపల్లి గోపీచంద్, తోటి ఉపాధ్యాయులు బహుధా అభినందించారు.

# ఎస్ఎంఏ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి రుషికుమార్‌కు ఆర్థిక సహాయం

## నాగవంశం సంక్షేమ సంఘం సభ్యుల నుంచి రూ.35 వేల విరాళం



**నవతరం శ్రీకాకుళం**

అరుదైన జన్యుపరమైన వ్యాధి ఎస్ఎంఏ టైప్--1తో బాధపడుతున్న విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన ముని ఆనంద్ కుమారుడు రుషి కుమార్ (5)కు నాగవంశం సంక్షేమ సంఘం సభ్యులు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు రాణిగారి తోట 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు అప్పలనాయుడు ఆధ్వర్యంలో చిన్నారి ఇంటికి వెళ్లి రూ.35 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నగర నాగవంశం సంక్షేమ సంఘం కోశాధికారి కాళ్ళ వెంకట రమణ (భారత రమణ), సహాయ కార్యదర్శి డొకర శ్రీను అండ్ బ్రదర్స్, మరో సహాయ కార్యదర్శి రామసింగ్ రవి కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు బాయి పరమేశ్వరరావు, సంకురుబోతు ప్రసాద్ (ఎంకే ఏజెన్సీస్), గాడు రాజబాబు (మణికంఠ ఫర్నిచర్స్), సుంకర సూరి (బోర్ వెల్స్) తలో రూ.5 వేల చొప్పున సహాయం అందించారు. చిన్నారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, భవిష్యత్తులో కూడా సాధ్యమైనంతవరకు సహాయం చేస్తామని సంఘం సభ్యులు భరోసా ఇచ్చారు.

# ప్రతినిత్యం.. ప్రజాపక్షం

- ప్రజల గుండెల్లో వైఎస్ఆర్సిపి జెండా
- పార్టీ ఆవిర్భావమే ఓ సంచలనం ! ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచిన 'వైయస్సార్సీపి'
- శ్రీకాకుళం జిల్లాలో వివిధ సమస్యలపై ప్రజల పక్షాన ఎనలేని పోరాటాలు
- సీఎంగా పాలన అంటే ఇలా ఉండాలని చూపించిన వైయస్ జగన్
- 2011 మార్చి 12 న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం



(డాక్టర్ నిమ్మాన దాస్.. ఎంపీపీ, సోంపేట)

విలువలు, విశ్వసనీయతే ఆ పార్టీ మూల స్తంభాలు... సంక్షేమం, అభివృద్ధి ఆ పార్టీ సిద్ధాంతాలు.. ప్రజాపక్షమై పోరాటాలు చేయాలన్నా .. ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలన్నా ఆ పార్టీ తోనే సాధ్యం. ప్రజా ఆకాంక్షల మేరకు ఆవిర్భవించిందా పార్టీ. అదే వైయస్సార్ సీపీ. కష్టాలను తట్టుకుంటూ.. కన్నీళ్లను దిగమింగుకుంటూ ఉదయించిన ప్రజానాయకుడు అతడు.. ఒకప్పుడు కేంద్రంలోని పెద్దల వంచనను నిలదీస్తూ.. కొన్ని రాజకీయ పార్టీలన్నీ లోపాయికారి గా ఒకటై పన్నిన కుట్రలను పటా పంచలు చేస్తూ.. ఎదిరించి గెలిచిన విజేత తడు. అతడే.. వైయస్సార్ సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి. సరిగ్గా 15 ఏళ్ల క్రితం వైయస్సార్ ఘాట్ వద్ద రెపరెపలాడుకుంటూ నింగికెగిరిన పార్టీ జెండా.. నేడు ప్రజల గుండెల్లో నిలిచిపోయింది. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు వచ్చినప్పటికీ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా.. కుటిల రాజకీయాలను తరిమి కొట్టడమే ధ్యేయంగా వైయస్సార్సీపీ ఆవిర్భవించింది.' పార్టీ అంటే సామాన్య విషయం కాదు.. ఎన్ని రోజులు నడుపుతారో చూస్తా' మంటూ ప్రగల్భాలు పలికిన నేతలు కాలగర్భంలో కలిసిపోగా ప్రజల పక్షాన నిలిచిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో తిరుగులేని విజయాలు సాధించింది. నాడు కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ పెద్దలు ఏకమై వచ్చినా ఎదురొడ్డి చరిత్ర తిరగరాసే విజయాలు సాధించి యావత్ భారతదేశం లోనే పేరుగాంచింది. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు వచ్చాయి. తర్వాత కాలగర్భంలో కలిసిపోయాయి. దేశాన్ని శాసించిన జాతీయ పార్టీలు సైతం ఏపీలో గల్లంతయ్యాయి. కానీ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించి నిలబడ్డ పార్టీ ఏదైనా ఉందంటే అది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నే. " పార్టీ అంటే ప్రజలు.. పాలకులంటే ప్రజలే "అంటూ సరిగ్గా 15 ఏళ్ల క్రితం 2011 మార్చి 12 న ఆవిర్భవించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏపీ రాజకీయాల్లోనే పెను సంచలనంగా మారిందనడంలో అతిశయోక్తి లేదు . ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రజా వ్యతిరేక పాలనకు ఎదురొడ్డి పోరాడిన పార్టీగా వైయస్సార్సీపి ముద్ర వేసుకుంది. ఇదే రోజు 15 ఏళ్ల క్రితం ఇడుపులపాయలో ఒక్కడితో ఆవిర్భవించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేడు ప్రభంజనంలా మారింది. ఎన్ని శక్తులు ఏకమై కుట్రలు పన్నినా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎదురుతిడ్డి నిలబడ్డారు. మహానేత డాక్టర్. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆశయ సాధన లక్ష్యంగా ఏర్పాటైన పార్టీ విలువలు, విశ్వసనీ యత తో ప్రజలకు దగ్గర అయింది. ప్రతిపక్షమైనా, అధికార పక్షమైన ప్రజల అభిమతమే ధ్యేయంగా పనిచేస్తుంది. ఎన్ని పార్టీలు ఏకమై వచ్చినా.. ప్రజాబలంతో వైయస్ జగన్ ఒకే ఒక్కడిగా రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచారు. యువజన శ్రామిక రైతు కాంగ్రెస్ పార్టీ పేరుతో కొత్త పార్టీని ప్రారంభించిన ఏడాదికే 17 అసెంబ్లీ, ఒక ఎంపీ స్థానాన్ని గెలుచుకున్న వైయస్ జగన్.. 2014 మే లో జరిగిన ఎన్నికల్లో 67 స్థానాల్లో గెలిచి .. ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందారు. ఆ తర్వాత రైతు భరోసా యాత్ర, ఏపీకి ప్రత్యేక హోదాపై ఢిల్లీలో చేపట్టిన ధర్నా వంటి కార్యక్రమాలలో ప్రజాభిమానాన్ని కూడగట్టారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి సమాధి వద్ద నుంచి 2017 నవంబర్ 6న ప్రజా సంకల్ప పాదయాత్రను వైయస్ జగన్ ప్రారంభించారు. ఎముకలు కొరికే చలిలో.. మండుటెండలో .. కుంభవృష్టిలో 14 నెలలపాటు 3,648 కిలోమీటర్లు దూరం సాగిన పాదయాత్రను 2019 జనవరి 9న శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వద్ద ముగించారు. ఈ పాదయాత్రకు అన్నిచోట్ల ప్రజలు బ్రహ్మరథం పట్టారు. తెలుగుదేశం ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన ను కూకటి వేళ్ళతో పెకలిస్తూ 2019 ఎన్నికల్లో వైయస్సార్సీపి కి అఖండ విజయాన్ని ప్రజలు అందించారు. దేశ చరిత్రలో 50 శాతానికి పైగా ఓట్లతో 151 శాసనసభ( 87 శాతశీ ), 22 లోక్ సభ( 88 శాతం) స్థానాలను కైవసం చేసుకుంది. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టో ప్రకారం 2019 మే 30న ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణస్వీకారం చేస్తూ.. తొలి మంత్రివర్గంలో 56 శాతం ఎస్సీ, ఎస్టి, బీసీ, మైనార్టీలకు ఇచ్చి.. ఐదు డిప్యూటీ సీఎం పదవు లలో నాలుగు ఆ వర్గాలకే ఇచ్చి, సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 95 శాతం హామీలు అమలు చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు అన్ని విధాల ఆదుకున్నారు. పాలన అంటే ఇలా ఉండాలని ముఖ్యమంత్రిగా జగన్ నిరూపించుకున్నారు. రైతు భరోసా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్, నాడు- నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో ఆధునికరణ, గ్రామ సచివాలయాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వెల్నెస్ సెంటర్లు, నిరుపేదలకు ఇంటి స్థలాలు, జగనన్న కాలనీలు , ఆరోగ్యశ్రీ రూ. 25 లక్షలకు పెంపు సమాజంలో బడుగు, బలహీన వర్గాలకు వివిధ సంక్షేమ పథకాలు అమలు వంటి కార్యక్రమాలు చేపట్టి, దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చి దిద్దిన ఘనత వైయస్ జగన్ దే. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థతోపాటు ఈ క్రమంలో లక్షలాది మంది నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయి.

ఇలా ఒకటేమిటి ఎన్నో సంస్కరణలకు వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టడం జరిగింది. ప్రధానంగా వెనుకబడిన ప్రాంతమైన శ్రీకాకుళం జిల్లాలో మూలపేట పోర్ట్ నిర్మాణానికి అంకురార్పణ చేయడమే కాక, పలాసలో సుమారు 70 కోట్ల రూపాయలు వేయంతో డాక్టర్ వైయస్సార్ కిడ్నీ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు, వంశధార నదీ జలాలు ఇచ్ఛాపురం వరకు ప్రజలకు శుద్ధి చేయబడిన మినరల్ వాటర్ ప్రాజెక్టుకు 700 కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఘనత నాటి ముఖ్యమంత్రి వైయస్ జగన్ దే. గడచిన ఎన్నికల్లో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే కుట్ర పన్నింది. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని, ప్రజల పక్షాన వైఎస్ఆర్సిపి నిలదీస్తే..

వారిపై వివిధ పోలీస్ కేసులుపెట్టడం, దాడులు, దౌర్జన్యాలు చేస్తూ.. రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుంది. కేవలం రెండేళ్ల పాలనలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకత మూట కట్టుకున్న కూటమి ప్రభుత్వ విధానాలపై వైయస్సార్సీపి ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుంది. ఎన్ని కష్టాలు వచ్చినా.. వైఎస్ఆర్సిపి శ్రేణులు చెక్కుచెదరకుండా.. 2029 ఎన్నికల్లో వైయస్సార్సీపి విజయమే లక్ష్యంగా ముందుకు సాగడమే .. సవాలుగా స్వీకరించింది.

# ఆరోగ్యానికి నడకే మహా సాధనం

- వ్యాయామం తగ్గడంతో పెరుగుతున్న అనారోగ్య సమస్యలు
- రోజూ నడక అలవాటు చేసుకుంటే ఆరోగ్యానికి రక్షణ

**నవతరం శ్రీకాకుళం**

నడక ఆరోగ్యానికి అత్యంత ఉపయోగకరమైన వ్యాయామమని వైద్యులు, పెద్దలు ఎప్పటినుంచో చెబుతున్నారు. అయితే ఆధునిక జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోవడంతో అనేక రకాల వ్యాధులు మనుషులను వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ రోజూ కొంతసేపు నడకను అలవాటు చేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రకృతి నియమం ప్రకారం ప్రతి జీవికి శారీరక శ్రమ అవసరం. మనిషిని తప్ప ఇతర జీవులు తమ ఆహారం కోసం సహజంగా శ్రమిస్తాయి. అయితే ఆధునిక సౌకర్యాల కారణంగా మనుషులు శారీరక శ్రమను తగ్గించుకోవడంతో ఊబకాయం, గుండెజబ్బులు, మధుమేహం వంటి సమస్యలు పెరుగుతున్నాయి. చిన్న వయస్సులోనే గుండెపోటులు వంటి తీవ్రమైన వ్యాధులు రావడం దీనికే నిదర్శనం.



పూర్వకాలంలో పెద్దలు ఎక్కువగా నడిచి పనులు చేసేవారు. సహజమైన ఆహారం తీసుకుంటూ సమయానికి నిద్రపోయి, ఉదయాన్నే లేచి తమ పనుల్లో నిమగ్నమయ్యేవారు. అందువల్ల వారు ఎక్కువకాలం ఆరోగ్యంగా జీవించగలిగారు. ప్రస్తుతం ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే అలవాటు కొందరిలో కనిపిస్తున్నప్పటికీ, అందరూ నడక ప్రాముఖ్యతను గుర్తించాల్సిన అవసరం ఉంది. ప్రతిరోజూ నడకను అలవాటు చేసుకుంటే అనేక రోగాల నుంచి రక్షణ పొందవచ్చు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు నడక కార్యక్రమాలు, పోటీలు నిర్వహించడం ద్వారా ప్రోత్సహించవచ్చు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడం కూడా ప్రజలకు ఉపయోగకరంగా మారుతోంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణపై కూడా ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలి. పాలిథిన్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గిస్తూ మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**